సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం | 24 | జనవరి | 2023



భక్తులకు ఇబ్బంది కలగొద్దు

త్వరలో ప్రారంభమయ్యే మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

- 8లో



క్రీడలతో ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి

- 8లో

క్రీడాకారులు, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఓరుగల్లు ఖ్యాతిని చాటాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0°/16.0°

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పూట చలిగా ఉంటుంది.

కాసులతోనే కథ!



భవనాలు.. అంతస్థులు పెరిగినకొద్దీ బేరాలు

- నిర్మాణాలకు అన్ని పత్రాలున్నా లంచాల ఆశతో కొర్రీలు
- ఫైల్‌కు రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వసూళ్లు
- ముప్పతిప్పలు పడుతున్న కొత్త భవన నిర్మాణదారులు

వరంగల్ అర్బన్:

➲ వడ్డేపల్లికి చెందిన శ్రీరాములు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. సొంతింటి కల నెరవేర్చుకోవాలనేది ఆయన కోరిక. బ్యాంక్ రుణం తీసుకొని టీఎస్–బీపాస్‌లో భవన నిర్మాణానికి దరఖాస్తు చేశారు. ఆ స్థలం ప్రొహిబిటెడ్ స్థలమంటూ దరఖాస్తును తిరస్కరించారు. మధ్యవర్తిని సంప్రదించి బేరసారాలు సాగించి రూ.30వేలు సమర్పిస్తే అనుమతి పత్రం చేతికందింది.

➲ హంటర్ రోడ్డులోని సుధాకర్ కిరాణం నడుపుతాడు. భవన నిర్మాణానికి 5 నెలల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. అయితే ఆ స్థలం కమర్షియల్ ల్యాండ్ యూజ్ కిందకు వస్తుందని పెండింగ్‌లో పెట్టారు. చైన్‌మెన్ ద్వారా వెళితే రూ.25వేలు తీసుకొని అనుమతి కాపీ ఇచ్చారు.

➲ వరంగల్ 2వ బ్యాంక్ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంది. ఈ కాలనీ లే అవుట్‌కు సంబంధించి అన్ని అనుమతులున్నాయి. అధికారులు పత్రాలను పరిశీలించి మూడు నెలలు గడిచినా ఇప్పటికీ అనుమతి ఇవ్వలేదు.

మహా నగరంలో భవన నిర్మాణానికి సొంత స్థలంతోపాటు వాటికి సంబంధించి అన్ని పత్రాలు, ఫీజులు చెల్లించినా అనుమతి పొందడానికి ముప్పుతిప్పలు పడుతున్నారు. నిర్మాణం విషయంలో ప్రతీ ఫైల్‌కు కాసులిస్తేనే కథ నడుస్తోంది. భవన అంతస్థులు పెరిగినకొద్దీ ఆ మేరకు బేరసారాలు సాగిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా కొత్త కొర్రీలు సృష్టిస్తూ రూ.10వేల నుంచి రూ.30వేల వరకు ముట్టజెబితేనే పని కానిస్తున్నారు. అపార్టుమెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి రూ.లక్షల్లో గుంజుతున్నారు. ఏదో ఒక డివిజన్‌లోనే కాదు.. నగర వ్యాప్తంగా ఇది పరిస్థితి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> ‘టీఎస్–బీపాస్ అద్భుత సంస్కరణ. భవన నిర్మాణానికి స్వీయ ధ్రువీకరణ ద్వారా దరఖాస్తు చేస్తే చాలు చకచకా అనుమతులొస్తాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు’
>
> - రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్

21 రోజుల్లో...

భవన నిర్మాణ దరఖాస్తులు తీసుకోవడానికి మొదట్లో మ్యానువల్ ఆ తర్వాత ఆన్‌లైన్, డీపీఎంఎస్ పద్ధతులను వినియోగించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం పురపాలక చట్టం–2019 అనుసరించి తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం(టీఎస్–బీపాస్) తీసుకొచ్చింది. దీని ద్వారా కొత్తగా ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అనుమతి పొందవచ్చు. 75 చదరపు గజాల నుంచి 200 మీటర్ల వరకు(7 మీటర్లు ఎత్తుండే) జీప్లస్–1 నివాసాలకు వెంటనే అనుమతిస్తారు. 200 చదరపు మీటర్ల విస్తీర్ణం పైబడిన 500 చదరపు మీటర్ల వరకు(10 మీటర్ల ఎత్తు వరకు) స్వీయ ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే జీప్లస్–2 కంటే ఎక్కువ అంతస్తులకు సింగిల్ విండో ద్వారా అనుమతి ఇస్తారు. 75 చదరపు గజాలు ఉన్న స్థలంలో నిర్మించుకునే భవన నిర్మాణానికి టీఎస్–బీపాస్ ద్వారా దరఖాస్తు చేస్తే రూపాయికే పర్మిషన్ మంజూరు చేస్తారు. అయితే 21 రోజుల్లో అనుమతి లేదా తిరస్కరణ ఏదో ఒకటి జరగాలి. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయకపోతే భవన నిర్మాణ అనుమతి మంజూరు చేసినట్లుగా భావిస్తారు.

మూడు దశల్లో వెరిఫికేషన్

టీఎస్–బీపాస్ ద్వారా స్వీయ ధ్రువీకరణతో దరఖాస్తులకు కలెక్టర్ల ఆధ్వర్యంలో పది పోస్టు వెరిఫికేషన్ బృందాలు ఉన్నాయి. బల్దియా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఏఈలకు ఈ బాధ్యతలు అప్పగించారు. భవన నిర్మాణ ఫైల్ ర్యాండమ్ పద్ధతిలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్.. డాక్యుమెంట్ వెరిఫికేషన్, మరో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్.. టైటిల్ వెరిఫికేషన్ చేస్తాడు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీలకు చెందిన ఎవరో ఒక ఏఈ స్థల పరిశీలన చేస్తారు. నిబంధనల మేరకు పత్రాలు, ల్యాండ్ ఉంటే భవన నిర్మాణ అనుమతి పత్రాలను మంజూరు చేస్తారు.

అనుమతుల దందా..

నగరంలో సాంకేతిక పరిజ్ఞానం, వివిధ పత్రాలు పొందడం లాంటి సమస్యలతో లబ్ధిదారులు 90 శాతం పైగా సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు. భవన నిర్మాణ ప్లాన్, బల్దియా టౌన్ ప్లానింగ్, ఇద్దరు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర విభాగాలకు చెందిన ఓ ఏఈకి మూడు దశల్లో మామూళ్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందని నిబంధన పెడుతున్నారు. చేతికి మట్టి అంటకుండా బల్దియా, ఇతర విభాగాల సిబ్బంది స్థల పరిశీలనకు రాకపోవడం, దరఖాస్తులో చిన్న లోపాలతో తిరస్కరించటం వంటివి చేస్తున్నారు. డబ్బులు ముట్టజెబితే ఒక రకంగా, డబ్బులు ఇవ్వని వాళ్లను మరో రకంగా కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రూ.లక్షల్లో ఫీజులు చెల్లించినా మామూళ్ల వ్యవహారం ఏమిటని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

> **ఫిర్యాదులను సమీక్షిస్తాం..**
>
> టీఎస్–బీపాస్ ద్వారా అందిన దరఖాస్తులను 21 రోజుల్లో పరిష్కరిస్తున్నాం. ఏమైనా లోపాలు ఉంటేనే తిరస్కరణకు గురవుతున్నాయి. జాప్యం జరగడం లేదు. సమస్యలు ఉంటే సమీక్షించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.
>
> - వెంకన్న, బల్దియా సిటీ ప్లానర్

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో హనుమకొండలోని ఎస్‌ఎంఏ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. 38వ సబ్ జూనియర్, 5వ క్యాడెట్, 39వ జూనియర్, 38వ సీనియర్ బాలబాలికల విభాగంలో జరిగిన పోటీల్లో ప్రణీత్ గోల్డ్, చరణ్ గోల్డ్, దినకర్ గోల్డ్, శ్రీవర్షిణి సిల్వర్, రాహుల్ సిల్వర్, రాజ్‌కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు అకాడమీ చీఫ్ ఎల్లావుల గణేష్‌యాదవ్ తెలిపారు. వీరు ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కాగా.. పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్ టి.అనిల్‌యాదవ్‌లను తెలంగాణ తైక్వాండో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌గౌడ్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



విద్యారణ్యపురి: భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రీయ భాషా పండితుల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కక్కర్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల మురళీధర్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాషా పండితుల పదోన్నతుల కల్పనకు గతంలోనే సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆ తర్వాత జీఓ కూడా ఇచ్చారన్నారు. కానీ.. న్యాయపరమైన సమస్యలను సాకుగా చూపి పదోన్నతులు కల్పించడం లేదన్నారు. ఇప్పుడు చేపట్టబోతున్న ఉపాధ్యాయుల పదోన్నతులలో భాషా పండితులకు కూడా పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో భాషా పండితుల జేఏసీ బాధ్యులు అశోక్, కె.వెంకటేశ్వర్లు, గుండు రమేష్, ఇంద్రసేనారెడ్డి, మంజుప్రియ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 34 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 34 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ నరేందర్ తెలిపారు.

‘సంస్థ అభివృద్ధికి పాటుపడాలి’



హన్మకొండ: సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు, సిబ్బంది పాటుపడాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ 2023 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు కంపెనీ ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేయాలని, ఇందుకోసం అంకితభావంతో పని చేయాలన్నారు. బకాయిలు, విద్యుత్ బిల్లుల వసూళ్లు వంద శాతం సాధించాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు వారి సమస్యలు వివరించి.. పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డిస్కం ప్రధాన కార్యదర్శి రవీందర్, అధ్యక్షుడు ఆర్.పాండు, నాయకులు బి.సుధాకర్, బి.వి.రమణ, టి.శంకరయ్య, సునీల్‌కుమార్, రాజేష్, రాము, బాలాజీ, వెంకటేష్, రాంనితిన్‌రెడ్డి, కుమారస్వామి, రాములు, తరుణ్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల భవితవ్యమేంటి?
'సింగరేణి' పబ్లిక్ రంగంగానే ఉండాలి
10లో

వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖ 20, ఎస్సీ కార్పొరేషన్ 12, కలెక్టరేట్ డి సెక్షన్ 11, ఎంపీడీఓ 7తోపాటు తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 101 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ సబిత, డీసీఎస్‌ఓ వసంతలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సమస్యలు సత్వరమే పరిష్కరించండి
వరంగల్ కలెక్టర్ గోపి

కరీమాబాద్: ప్రజా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ గోపి అన్నారు. గ్రీవెన్స్ సందర్భంగా సోమవారం ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించే వీలు లేని వాటి గురించి, అందుకు గల కారణాల్ని దరఖాస్తుదారుడికి వివరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరులో అధికారులు జవాబుదారీతనం చూపించాలన్నారు. పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 71 దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ గోపి

గడువు తీరితే రద్దు చేయండి

నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే టెండర్ నిబంధనల ప్రకారం రద్దు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీర్లతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాబాట, జనరల్ ఫండ్, ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ తదితర పథకాల కింద చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్ పనులు, టెండర్లు, పనులు ప్రారంభానికి నోచుకోని అంశాలపై సమీక్షించారు. టెండర్ల ద్వారా పనులు దక్కించుకొని కొందరు కాంట్రాక్టర్లు వివిధ కారణాలు చూపుతూ కాలం వెళ్లదీయడం సరికాదని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. క్వాలిటీ కంట్రోల్ నివేదిక మేరకు బిల్లుల చెల్లింపు జరగాలన్నారు. అభివృద్ధి పనుల పట్ల ఇంజనీర్ల పనితీరు మార్చుకోవాలని, కొంత కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు బీఎల్.శ్రీనివాసరావు, రాజయ్య, సంజయ్‌కుమార్, శ్రీనివాసరావు, డీఈలు రవికుమార్, నరేందర్, సంతోష్ బాబు, రవికిరణ్, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

6,626 మందికి కంటి పరీక్షలు

ఎంజీఎం: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 45 కేంద్రాల్లో సోమవారం 6,626 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తెలిపారు. 1,629 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా.. 917 మందికి కంటి అద్దాల కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరుగా అర్జీలు ఇవ్వొచ్చు..

నయీంనగర్: కుడా పరిధిలోని ప్రజలు వారి సమస్యలపై నేరుగా అర్జీలు సమర్పించవచ్చని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, కుడా అధికారులు, ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉంటారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు అసౌకర్యం కలగకుండా తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

లింగ వివక్షను రూపుమాపాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

హన్మకొండ అర్బన్: లింగ వివక్షను రూపుమాపేందుకు కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సంక్షేమాధికారి ఎం.సబిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. ఆడ, మగ అనే తేడా పిలిచే పిలుపులో ఉండాలి తప్ప చూపించే ప్రేమలో ఉండకూడదన్నారు. ఇప్పటికీ కొన్నిచోట్ల గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారని, ఇలాంటి అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయడానికి 1994 గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం తెచ్చారన్నారు. ఇప్పటివరకు బాలబాలికల సంరక్షణ కోసం అధికారులు చేపడుతున్న చర్యలను ఆయన అభినందించారు. జిల్లా సంక్షేమాధికారి ఎం.సబిత మాట్లాడుతూ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ, పోలీస్, చైల్డ్‌లైన్ సమన్వయంతో లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ ఎ.శ్రీనివాస్‌కుమార్, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ కె.శిరీష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి.సంతోష్‌కుమార్, బాలల న్యాయ మండలి సభ్యులు మెరుగు సుభాష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎం.మౌనిక, డీవీ యాక్స్ కౌన్సిలర్ పావని, అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

- కాలనీల్లో వసతులు కల్పించండి.. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయండి..
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌కు 72 ఫిర్యాదులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్స్ సెల్‌లో అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. 72 ఫిర్యాదులు రాగా.. అందులో ఇంజనీరింగ్ విభాగానికి 12, టౌన్ ప్లానింగ్ 38, పన్నుల విభాగం 11, ప్రజారోగ్యం, శానిటేషన్ 4, తాగునీటి కోసం 6, ఎలక్ట్రికల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో బల్దియా అడిషనల్ కమిషనర్ రవీందర్‌యాదవ్, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, సీహెచ్‌ఓ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోనా, శ్రీనివాస్‌రెడ్డి, బయాలజిస్టు మాధవరెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేష్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు డుమ్మా

బల్దియా గ్రీవెన్స్‌కు కమిషనర్ ప్రావీణ్య హాజరు కాలేదు. దీంతో ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులతోపాటు ఆయా విభాగాల క్షేత్రస్థాయి సిబ్బంది డుమ్మా కొట్టారు. కొందరు చుట్టపు చూపుగా కనిపించి వెళ్లిపోగా, మరికొందరు హాజరు కాలేదు.

బైఠాయించి నిరసన

వరంగల్ 13వ డివిజన్ నవయుగ కాలనీలో వెయ్యి గజాల పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు బాబు గ్రీవెన్స్ సెల్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పార్కు స్థలం కబ్జా చేసి, ప్లాట్లుగా విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిధులు మంజూరైనందున వెంటనే ప్రహరీ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారుల సూచనతో నిరసన విరమించారు.

కొన్ని ఫిర్యాదులు ఇలా..


- పలివేల్పుల, దుర్గానగర్ కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 2వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో 250 కుటుంబాలు నివసిస్తున్నాయని, కొన్ని ఇళ్లకు పైపులైన్లు వేసినా నీరు సరిగా రావడం లేదని, అన్ని ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలని, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని అధ్యక్షుడు మంద మల్లేశం, కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.
- 29వ డివిజన్ పాపయ్యపేట చర్చి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని, ఎస్సీ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు, సింగారపు బాబు వినతిపత్రం అందజేశారు.
- 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీ పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించి, కబ్జాదారుల నుంచి కాపాడాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు.
- నగరంలో ఇంటింటా 163 స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరిస్తున్నామని, గత పద్ధతి ప్రకారం స్వచ్ఛ ఆటోలను కొనసాగించాలని యూనియన్ నాయకులు విన్నవించారు.
- అభివృద్ధి పనుల ఆర్ఎండీ, ఈఎండీ సొమ్ము ఇప్పించాలని హరిజన లేబర్ కాంట్రాక్టు కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు జి.రమేష్ వినతిపత్రం అందజేశారు.
- వరంగల్ పుప్పాలగుట్ట 16–9–223 డ్రెయినేజీ వ్యర్థాలతో నిండిపోయిందని, వెంటనే శుభ్రపరచాలని కాలనీవాసులు విన్నవించారు.
- 55వ డివిజన్ గోపాలపురంలో 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి ఓ వ్యక్తి అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్నారని, అతడిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విన్నవించారు.
- 31వ డివిజన్ న్యూశాయంపేట హంటర్ రోడ్డు సర్వే నం.260 రజక హిందూ శ్మశాన వాటికలోకి బతుకమ్మ కుంట మురుగునీరు చేరుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కె.బిక్షపతి, సంఘం పెద్దలు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ అశోకా థియేటర్ ఎదురుగా స్థలం లీజు గడువు పొడిగించాలని టిబెటియన్ రిఫ్యూజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



బల్దియా గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భగత్‌సింగ్ నగర్‌వాసులు

పదోన్నతులకు వేళాయె..

- జిల్లాలో టీచర్ల సీనియారిటీ జాబితాపై కసరత్తు
- టెంటేటివ్‌గా జాబితాలు వెల్లడి..
- పర్యవేక్షణ, పరిశీలనకు కమిటీ
- మార్గదర్శకాలు, షెడ్యూల్ కోసం నిరీక్షణ



విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సీనియారిటీ జాబితాపై కసరత్తు షురువైంది. పదోన్నతులు, బదిలీలకు షెడ్యూల్ విడుదలైనట్లు సోమవారం మీడియాలో వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈనెల 27 నుంచి బదిలీల ప్రక్రియ జరగనుంది. 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని, మార్చి 4 నాటికి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా ఇంకా షెడ్యూల్ విడుదల కాలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సిద్ధం కావాలని ఇటీవలే పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన డీఈఓలను ఆదేశించిన విషయం విదితమే. దీంతో జిల్లాలోని టీచర్లకు సంబంధించి సీనియారిటీ జాబితాలను టెంటేటివ్‌గా(తాత్కాలికంగా) సిద్ధం చేశారు. రెండు రోజులుగా తాత్కాలికంగా సీనియారిటీ జాబితాలను బయటికి కూడా వెల్లడించారు. వాటిలో చేర్పులు, మార్పులు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులు నిర్ణీత ప్రొఫార్మాలో తమ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ ఎండి.అబ్దుల్‌హై కోరారు.

జాబితా తయారీ పరిశీలనకు కమిటీ

టెంటేటివ్ సీనియారిటీ జాబితా ప్రిపరేషన్‌కు సంబంధించి పర్యవేక్షణకు డీఈఓ కమిటీని నియమించారు. పర్యవేక్షణకు డీఈఓ కార్యాలయ ఏడీ రామ్‌కుమార్, సూపరింటెండెంట్లు జి.శారద, శైలజ, గెజిటెడ్ హెడ్మాస్టర్ డాక్టర్ బి.రాంధన్, స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్), ఎస్ఎంఎం స్వామి(ఇంగ్లిష్), బి.మనోజ్‌కుమార్, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎం.పట్టాభి, ఎస్ఏ తెలుగు జి.సుధాకర్, ఎస్ఏ హిందీ ఎండీ అన్వర్, ఎస్ఏ ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ సుమాదేవి, ఎస్ఏ ఉర్దూ, ఎస్‌జీటీ ఉర్దూ మీడియం కోఆర్డినేటర్ రాధ, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పీడీ, పీఈటీ, సీఐ, డీఎం, మ్యూజిక్ ఒకేషనల్ బి.ప్రసాద్, ఎస్‌జీటీ కేటగిరీకి సంబంధించి హెడ్మాస్టర్లు బి.కుమార్, డి.ప్రభాకర్ స్కూల్ అసిస్టెంట్ బి.రమేష్, ఎస్‌జీటీ బ్రహ్మాచారి, సీనియర్ అసిస్టెంట్ రవిబాబు ఉన్నారు. వీటిలో డీఈఓ కార్యాలయ సిబ్బంది కూడా ఉన్నారు. కమిటీలో ఉన్న హెచ్ఎంలు కూడా పరిశీలనకు ఈనెల 24న తమ కార్యాలయానికి రావాలని డీఈఓ ఆదేశించినట్లు సమాచారం.

అభ్యంతరాల స్వీకరణ

సీనియారిటీ జాబితాను టెంటేటివ్‌గా రూపొందించగా.. అందులో అభ్యంతరాలుంటే నిర్ణీత ప్రొఫార్మాలో ఉపాధ్యాయుల నుంచి డీఈఓ కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల మార్గదర్శకాలు, షెడ్యూల్ విడుదలయ్యేసరికి సీనియారిటీ జాబితాలను టెంటేటివ్‌గా సిద్ధం చేసుకుని ఉంటే.. వచ్చే నియమ నిబంధనల ప్రకారం మళ్లీ సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

207 మందికి పదోన్నతులు

జిల్లాలో మేనేజ్‌మెంట్లు, ఉపాధ్యాయుల కేటగిరీల వారీగా అన్నీ కలిపితే 207 మందికి పదోన్నతులు పొందే అవకాశం ఉందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇందులో ప్రభుత్వ, లోకల్ బాడీల వారీగా పదోన్నతులు పొందే ఉపాధ్యాయుల సంఖ్య ఇలా ఉంది.

పదోన్నతుల కోసం వినతులు

గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరుతూ భాషాపండితులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. మరోవైపు స్పౌజ్ కేటగిరీ టీచర్లు తమకు బదిలీలు చేయాలని ప్రగతి భవన్‌ను ముట్టడించి ఆందోళనలు చేపడుతున్నారు. ఇంకోవైపు 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులు కూడా స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాలు పలు డిమాండ్లతో ఇప్పటికే హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రాలు సమర్పించాయి.

టీచర్ పోస్టులు	ప్రభుత్వ	లోకల్‌బాడీ
గ్రేడ్-2 హెడ్మాస్టర్	07	42
ఎస్ఏ మ్యాథ్స్(టీఎం)	01	08
ఎస్ఏ మ్యాథ్స్(యూఎం)	0	0
ఎస్ఏ ఫిజికల్ సైన్స్(టీఎం)	01	04
ఎస్ఏ బయోసైన్స్(టీఎం)	05	13
ఎస్ఏ బయోసైన్స్(యూఎం)	01	0
ఎస్ఏ సోషల్ స్టడీస్(టీఎం)	06	27
ఎస్ఏ సోషల్ స్టడీస్(యూఎం)	01	0
ఎస్ఏ తెలుగు	04	09
ఎస్ఏ హిందీ	04	05
ఎస్ఏ ఇంగ్లిష్	03	13
ఎస్ఏ ఉర్దూ	01	0
ఫిజికల్ ఎడ్యుకేషన్(టి)	01	04
పీఎస్ హెచ్ఎం తెలుగు	04	43

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

కాజీపేట: ఇద్దరు చిన్నపిల్లలతో సహా ఓ వివాహిత మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాపూజీనగర్ కాలనీకి చెందిన కంది అన్వేష్ ప్రైవేట్ పనులు చేసుకుంటూ భార్య, పిల్లలతో జీవిస్తున్నాడు. ఈనెల 15న అన్వేష్ పనుల నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి రాగా భార్య లావణ్య (26) కూతురు, కుమారుడు కనిపించడం లేదు. బంధు మిత్రుల ఇళ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో బాధితుడు అన్వేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

6,493 మందికి కంటి పరీక్షలు

గీసుకొండ: వరంగల్ జిల్లాలో కంటి వెలుగు కింద సోమవారం 44 కంటి పరీక్ష కేంద్రాల ద్వారా మొత్తం 6,493 మందికి కంటి పరీక్షలు చేసినట్లు డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 1,906 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేసి, 1,026 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసుల కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు.

రూ.లక్ష విరాళం

కాశోజీ సెంటర్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు, పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు వరంగల్ జిల్లాలో గ్రంథాలయ స్థాపనకు గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు రూ.లక్ష విరాళాన్ని కలెక్టర్ గోపికి అందించారు. ఈసందర్భంగా గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులను కలెక్టర్ అభినందించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాసరి మురళీధర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స, డీఆర్డీఓ సంపత్‌రావు, వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, డీసీఓ బి.సంజీవరెడ్డి, డీఎంఓ ప్రసాద్ రావు, సీపీఓ జీవరత్నం పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు


వనదేవతలను దర్శించుకుంటున్న మంత్రి


మేడారం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- మినీ మేడారం జాతరపై అధికారులతో సమీక్ష

ఎస్‌ఎస్‌తాడ్వాయి: త్వరలో ప్రారంభమయ్యే మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని గిరిజన సంక్షేమశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ములుగు జిల్లా ఎస్‌ఎస్‌తాడ్వాయి మేడారం ఐటీడీఏ క్యాంప్ ఆఫీస్‌లో మినీ మేడారం జాతరపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, జెడ్పీ చైర్మన్ జగదీష్, ఏఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. మినీ మేడారం జాతర కోసం భక్తుల సౌకర్యార్థం రూ. 3.10 కోట్లతో వివిధ శాఖల ద్వారా పనులు చేపట్టామన్నారు. వనదేవతలను దర్శించుకునేందుకు సుమారు ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రం చేయాలని, స్నాన గదులు, బట్టలు మార్చుకునే గదులు, పరిసరాలు శానిటైజ్ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

గ్రామీణ జాతరలపై దృష్టి పెట్టాలి

గ్రామీణ ప్రాంతాలైన కొండాయి, ఐలాపూర్, బయ్యక్కపేటలో జరిగే మినీ జాతరకు అన్ని ఏర్పాట్లను సమకూర్చాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జాతర పరిధిలో ఉన్న కోళ్లు, మేకలు దుకాణదారులతో సమావేశం నిర్వహించుకొని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ మాట్లాడుతూ కలెక్టర్‌కు రెండు మహా జాతరలను విజయవంతం చేసిన అనుభవం ఉందని, మినీ జాతర విజయవంతానికి అధికారుల సమన్వయంతో పరివేక్షణ చేస్తూ జాతర విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు మంత్రి జంపన్నవాగు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, డీఆర్‌ఓ రమాదేవి, సర్పంచ్ బాబురావు, ఎంపీపీ గొంది వాణిశ్రీ, ఆలయ ఈఓ రాజేందర్, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, ఏటీడీఓ దేశీరాం, ఆర్అండ్‌బీ ఈఈ వెంకన్న, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఇరిగేషన్ డీఈఈ సదయ్య, ఇరిగేషన్ ఏఈఈ కె.అరవింద్, డీఎల్‌పీఓ దేవరాజ్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి ప్రేమలత, అధికారులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించడానికి దొంగతనం

హసన్‌పర్తి: తీసుకున్న అప్పు చెల్లించడం కోసమే ముగ్గురు యువకులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై భరత్ సోమవారం తెలిపారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని ఓ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో ఆదివారం ప్రవేశించి ల్యాప్‌టాప్‌తో పాటు మూడు సెల్ ఫోన్లు దొంగిలించిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన తోట చరణ్ తమిళనాడులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువున్నారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం తన వద్ద ఉన్న ఐఫోన్‌ను ఓ వ్యక్తి వద్ద తాకట్టుపెట్టి అప్పుగా రూ.30వేలు తీసుకున్నాడు. కళాశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో అదే కాలేజీలో చదువుతున్న బాబిరెడ్డి అనే స్నేహితుడితో కలిసి సూర్యాపేటకు బయలుదేరారు. ఇంటికి వెళ్తే ఐఫోన్ గురించి తల్లిదండ్రులు ప్రశ్నిస్తారని భయపడి హైదరాబాద్‌లోని తన బాబాయి వద్దకు చేరుకున్నాడు. అక్కడే సెలవులు పూర్తి కావడంతో తన బాబాయి కొడుకు మధుకర్‌ను వెంటబెట్టుకుని తమిళనాడుకు బయలుదేరారు. ఈ క్రమంలో మధిర ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ఆదివారం వరంగల్‌లో రైలు దిగారు. దొంగతనం చేసి అప్పు చెల్లించాలని నిర్ణయానికి వచ్చారు. దీనికి హాస్టల్‌లే మంచిదని భావించి అన్నాసాగరంలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో ల్యాప్‌టాప్, మూడు మొబైల్స్ చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కారు. ఇందులో బాబిరెడ్డి పరారీలో ఉండగా చరణ్, మధుకర్‌లను రిమాండ్‌కు తరలించారు.

వ్యభిచారం ముసుగులో దోపిడీలు


అరెస్ట్ చూపుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వ్యభిచారం ముసుగులో దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను మామునూరు పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి తెలిపారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు కొత్తూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, పర్వతగిరికి చెందిన రాయపురం సరిత, కేసముద్రంకు చెందిన కోడం స్వరూప, నూనె స్వప్నలు కలిసి ఒక ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందులో ముగ్గురు లేడీ కిలాడీలు ముఠాగా ఏర్పడి బస్‌స్టేషన్‌లలో అమాయకులైన యువకులను తమ సైగలతో ఆకర్షించి వారిని ప్రలోభ పెట్టి ఓ వాహనంలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లే వారు. ఈ క్రమంలో విజయ్‌కుమార్ సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని యువకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికీ మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో రూ.20వేలు, సెల్‌ఫోన్, గీసుకొండ పీఎస్ పరిధిలో రూ.3వేలు, సెల్‌ఫోన్‌లను బలవంతంగా దోచుకున్నారు. ఈ ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచి మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తన సిబ్బందితో సోమవారం రాంగోపాల్‌పురం వద్ద నిందితురాళ్లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ నరేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్సై రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు సర్దార్‌పాషా, రోజాలను ఈస్ట్‌జోన్ డీసీపీ అభినందించారు.

క్రీడలతో ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి

- ఎమ్మెల్యే అరూరి రమేశ్
- ముగిసిన హాకీ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్

మామునూరు: క్రీడాకారులు, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఓరుగల్లు ఖ్యాతిని చాటాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ. 20 లక్షల నిధులతో హాకీ క్రీడా ప్రాంగాణాన్ని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో సీనియర్ హాకీ కోచ్ ఎండీ హుస్సేన్ ఆధ్వర్యంలో బషీర్ హుస్సేన్ (అమ్జద్) స్మారకార్థం గత రెండు రోజులుగా జరుగుతున్న హాకీ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో మక్కువ పెంచుకున్నట్లయితే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ప్రతి క్రీడాకారుడు వచ్చిన అవకాశాలను వదులుకోకుండా ప్రభుత్వం అందించే పోత్సాహకాన్ని స్వీకరించి ఉన్నత స్థాయిలో ఎదగాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ భిక్షపతి, కార్పొరేటర్ అరుణ విక్టర్, రిటైర్డ్ పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే విజేతగా నిలిచిన ధనరాజ్ జట్టు కెప్టెన్ హిదాహిజ్‌కు ట్రోఫీ, మెమోంటోను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్దిక్, రాజేందర్, ఇబ్రహింఖాన్, పండరినాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు



మడికొండ: కాజీపేట మండలం మడికొండ టీఎస్‌జీఓఎస్ కాలనీలోని ఖాళీ ఇంటి స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు పాండ్యాల బాలకిషన్ స్థలాన్ని గ్రామానికి చెందిన పల్లపు మహేష్, పల్లపు మల్లికార్జున్, పల్లపు కుమార్‌లు కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేయడంతో ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహారావు తెలిపారు. భూ కబ్జాదారులపై పోలీసు కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ పెడుతూ సామాన్యులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

చీటింగ్ కేసు..

కాజీపేట: కాజీపేట పట్టణంలో సోమవారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరిపై చీటింగ్ కేసు నమోద్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాగిత నితిన్ రెడ్డి, రైనేని హరికృష్ణలు జరిమానాల భారి నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేసి రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కాజీపేట: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురు వాహనదారులను సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కె.విద్యాసాగర్‌రావు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కాజీపేట చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోటం శ్రీను, పాశం రమేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు తెలిపారు. వారికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష వేసినట్లు ఆయన తెలిపారు.

ఇటుక బట్టీల్లో ఆకస్మిక తనిఖీ

మామునూరు: అనుమతి లేకుండా ఇటుక బట్టీకి వ్యవసాయ భూమిని లీజ్‌కు ఇవ్వడంతో పాటు రైతుబంధు సాయాన్ని పొందుతున్న రైతు భూమిని తహసీల్దార్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల కొంతమంది అధికారులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం తహసీల్దార్ ఫణి కుమార్‌తో పాటు విజిలెన్స్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు బొల్లికుంట గ్రామ శివారులోని 521 సర్వే నంబర్‌లోని భూమిలో తనిఖీ చేశారు. నాలా పర్మిషన్ లేకుండానే రైతు ఇంద్రసేనారెడ్డి తన భూమిని ఇటుక బట్టీల తయారీకి లీజ్‌కు ఇవ్వడంతో పాటు రైతు బంధు కూడా పొందుతున్నాడు. దీనిపై ప్రభుత్వాన్ని మోసం చేసి రైతుబంధు పొందుతున్న రైతుతోపాటు అనుమతిలేని ఇటుక బట్టీ వ్యాపారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


బహుమతి అందజేస్తున్న సునీత, తదితరులు

భూపాలపల్లి అర్బన్: మూడు రోజులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల పోటీలు సోమవారం ముగిశాయి. తొమ్మిదవ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో రంగారెడ్డి–మెదక్ జిల్లాల జట్లు తలపడగా రంగారెడ్డి జిల్లా 7–3 తేడాతో ఘన విజయం సాధించింది. పోటీల ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రీడల అధికారిణిని బుర్ర సునీత ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అభినవ వినయ్‌కుమార్, సింగరేణి స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు బడితెల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'అనురాగ వీచికలు' ఆవిష్కరణ


అనురాగ వీచికలు సంపుటిని ఆవిష్కరిస్తున్న హరికృష్ణ

హన్మకొండ కల్చరల్: హన్మకొండ రెడ్డికాలనీకి చెందిన కవయిత్రి మేరుగు అనురాధ రచించిన సున్నితం ప్రక్రియకు సంబంధించిన 'అనురాగ వీచికలు' సంపుటిని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన వివిధ జిల్లాలకు చెందిన సాహితీవేత్తలు రచించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, ప్రముఖ సాహితీవేత్తలు నాగేశ్వరం శంకరం, నెల్లుట్ల సునీత, నివేదిత, అమ్మంగి వేణుగోపాల్, అయినంపూడి శ్రీలక్ష్మి, ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.


కేయూలో మెస్‌ల రీఓపెన్


కేయూలోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కేయూలో సంక్రాంతి సెలవులు ఈనెల 20న ముగియడంతో సోమవారం విద్యార్థుల రాకతో క్యాంపస్‌లోని హాస్టళ్లు అన్నింటిని ఓపెన్ చేయడంతో మెస్‌లను కూడా రీఓపెన్ చేశారు. కామన్‌మెస్‌లో మరమ్మతు కొనసాగుతుండటంతో ప్రత్యామ్నాయంగా కేయూలోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో డైనింగ్‌ను ఏర్పాటు చేసి మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు. తొలిరోజు 300 మంది విద్యార్థులకు భోజనం కల్పించినట్లు సమాచారం. పద్మాక్షి మహిళా హాస్టల్ లోనూ సోమవారం మెస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. రెండుమూడు రోజుల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరుగనుంది.

అత్యాచారం, హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

- రూ.4 లక్షల జరిమానా



వరంగల్ లీగల్: ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేయగా అధిక రక్త స్రావమై మృతి చెందిన యువతి శవాన్ని ఆమె ఇంటికి సమీపంలో రోడ్డుపై పడేసి పారిపోయిన నేరంలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన నేరస్తుడు పులి సాయికుమార్‌కు జీవిత ఖైదు జైలు, రూ.4లక్షల జరిమానా విధిస్తూ సోమవారం హనుమకొండ జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. హన్మకొండ దీన్‌దయాళ్‌నగర్‌లో అద్దెకు ఉంటూ సమీపంలో కూరగాయల దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్న గాదం మల్లయ్య చిన్న కుమార్తె మానస (18) ఇంటర్ వరకు చదివి, తల్లిదండ్రులకు కూరగాయల దుకాణం వద్ద సహాయపడుతుంది. ఈ క్రమంలో సమీపంలో ఉన్నటువంటి ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పులి సాయికుమార్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మానసను నమ్మించి నవంబర్ 27, 2019న కారులో కాజీపేట రాంపూర్ రైల్వే ట్రాక్ దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ మానసను అత్యాచారం చేయడంతో తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందింది. మృతురాలి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సాయికుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో పలు సెక్షన్ల కింద జైలు శిక్ష విధించారు. కేసును పోలీసు అధికారులు సిహెచ్ అజయ్‌కుమార్, షుకుర్ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ వి.రాజు, హోంగార్డు శ్రీధర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


పరమేశ్ (ఫైల్)

తరిగొప్పుల: కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండల పరిధిలోని బొత్తలపర్రె శివారులో సోమవారం జరిగింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం మైలాపురం గ్రామానికి చెందిన బొంత పరమేశ్ (40), సత్యనారాయణ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్తున్నారు. ఈ సమయంలో జగిత్యాలకు చెందిన బెజ్జంకి అనిల్‌కుమార్ కారులో చౌటుప్పల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో బొత్తలపర్రె శివారులో మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టింది. దీంతో బైక్ వెనకాల కూర్చున్న పరమేశ్ ఎగిరి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో యువకుడు..


హత్తిరాం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: పాము కాటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామన్నపేట కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట కాలనీలో నివాసం ఉండే ఆంగోత్ హత్తిరాం (38) ఈ నెల 21న మధ్యాహ్నం ఇంట్లో మంచంపై పడుకుని ఉండగా పాము కాటువేసింది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కారు ఢీకొని వ్యక్తి..

వర్ధన్నపేట: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట శివారు దుర్గమ్మగుడి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మన్నపేటకు చెందిన యాకయ్య (38), నాగరాజులు బైక్‌పై జఫర్‌గఢ్‌కు వెళ్తున్నారు. జఫర్‌గఢ్ నుంచి వర్ధన్నపేటకు వస్తున్న కారు దుర్గమ్మ గుడి సమీపంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో యాకయ్య మృతి చెందగా నాగరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఫోర్జరీ కేసులో నిందితుల అరెస్ట్

ఖిలా వరంగల్: తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి వ్యవసాయ భూమిని నకిలీ నాలా కన్వెర్షన్ ఆర్డర్ పత్రాలను సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఖిలా వరంగల్ గ్రామానికి చెందిన తోటకూరి కొమురయ్య, తోటకూరి నర్సయ్య, తోటకూరి కొమురయ్యల పేరు మీద గత సంవత్సరం సెప్టెంబర్ 21న మండల తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఒక్కొక్కరికి 15 గుంటలు నకిలీ నాలా కన్వెర్షన్ ఆర్డర్ పత్రాలను సృష్టించారు. నకిలీ పత్రాలను మండల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించగా అధికారులు వారిపై భూమి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై అసలు భూ యజమానులు తహసీల్దార్‌ను నిలదీయడంతో వారి పేర్లతో తాను నాలా పర్మిషన్ ఇవ్వలేదని.. తన సంతకాన్ని ఎవరో ఫోర్జరీ చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను సృష్టించిన 15మందిపై కేసు నమోదు కాగా మధ్యకోటకు చెందిన తోటకూరి కొమురయ్య (బుచ్చి కొమురయ్య), నర్సయ్య, కుమారస్వామి, కుమారస్వామి, రాము, లక్ష్మణ్, కుమారస్వామి, సతీష్, కందుల విజయ, కందుల శ్రావణ్‌కుమార్, నూర మాధవిలు పరారీలో ఉండగా మధ్యకోటకు చెందిన ఇట్యాల సతీష్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రైటర్ కరీమాబాద్ ప్రాంతానికి చెందిన గోనే రాంప్రసాద్ , మండల రిజిస్ట్రేషన్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హన్మకొండ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన చిట్యాల ప్రవీణ్, బీమారం గ్రామానికి చెందిన దాసరి మునీందర్‌లను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై సస్పెన్షన్ వేటు?

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆడిట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ మునీందర్‌లపై సస్పెన్షన్ వేటుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్ అక్రమ నాలా ఉత్తర్వులతో రిజిస్ట్రేషన్లకు పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మోసాలకు పాల్పడిన వ్యక్తిపై పీడీయాక్టు


పీడీయాక్టు ఉత్తర్వులను అందజేస్తున్న సదన్‌కుమార్

వరంగల్ క్రైం: ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పీడీయాక్టు ఉత్తర్వులను జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతి యువకులను మోసం చేస్తున్న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన దాకురి భిక్షంపై సీపీ జారీ చేసిన పీడీయాక్టు ఉత్తర్వులను వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం సదన్‌కుమార్ నిందితుడికి ఖమ్మం కారాగారంలో అందజేశా రు. అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఉద్యోగాల పేరుతో యువతి, యువకులను మోసం చేస్తూ లక్షల్లో డబ్బు వసూళ్లకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని సీపీ తెలిపారు.